క్లుప్తంగా

సూర్యప్రభ వాహనంపై శ్రీమహావిష్ణువు


సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

సైదాపురం: మండలంలో వైకుంఠపురంలోఉన్న శ్రీమహావిష్ణువు ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారు సూర్య ప్రభవాహనంపై విహరించారు. ఉదయం స్వామివారికి విశేషాలంకరణ చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తిరుచ్చి ఉత్సవం జరిపారు.

నేడు రథోత్సవం

శ్రీమహావిష్ణువు బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రథోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

మోమిడి చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు


దైవ సందేశం ఇస్తున్న దినకర్‌బాబు

చిల్లకూరు: తీర ప్రాంతంలోని మోమిడి గ్రామంలో ఉన్న లూథరన్ చర్చిలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తిరుపతికి చెందిన సౌత్ ఆంధ్ర లూథరన్ చర్చి బోర్డు ఆఫ్ ట్రస్టీస్ చైర్మన్ వేముల దినకర్‌బాబు దైవ సందేశం ఇచ్చారు. ఈస్టర్ తరువాత ఆదివారం కావడంతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేందుకు క్రైస్తవులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం దినకర్ బాబును క్రైస్తవులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్యారిస్ చైర్మన్ రిబ్కా, వైస్ చైర్మన్ సుధాకర్, యూత్ సభ్యులు సునీల్ అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

108 అంబులెన్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడిగా బల్లి కిరణ్‌కుమార్


కిరణ్‌కుమార్‌ను అభినందిస్తున్న నేతలు

నాయుడుపేట టౌన్ : 108 అంబులెన్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడిగా నాయుడుపేటకు చెందిన బల్లి కిరణ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో ఏపీ 108 కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం రాష్ట్ర మహాసభలు శనివారం నుంచి రెండు రోజులు పాటు నిర్వహించారు. ఈ మహాసభలో నాయుడుపేట 108 అంబులెన్స్‌లో 17 ఏళ్ల నుంచి ఈఎంటీగా విధులు నిర్వహిస్తున్న కిరణ్‌కుమార్ మూడోసారి ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వాటర్‌ప్లాంట్ ప్రారంభం


వాటర్‌క్యాన్‌లను పంపిణీ చేస్తున్న మౌనికరెడ్డి

వెంకటగిరి: పట్టణంలోని బంగారుపేట ఆంజనేయస్వామి గుడివీధిలో మౌనిక చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆ సంస్థ చైర్మన్ మౌనికరెడ్డి ఆదివారం ఆర్‌ఓ వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు పవన్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, కౌన్సిలర్ సుబ్బారావు పాల్గొన్నారు.

రాపూరు సొసైటీ అధ్యక్షుడిగా పాపకన్ను



రాపూరు: స్థానిక సొసైటీ అధ్యక్షుడిగా పాపకన్ను వేణుగోపాల్‌రెడ్డి నియమిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు అందాయని జేసీఎస్ కన్వీనర్ దందోలు నారాయణరెడ్డి తెలిపారు. అలాగే సభ్యులుగా కేత చిన్నవెంకురెడ్డి, మతకాల పెంచలయ్య నియమించినట్లు ఆ ఉత్తర్వులో పేర్కొన్నట్లు తెలిపారు.

ప్రశాంతంగా గురుకులం ప్రవేశ పరీక్ష

దొరవారిసత్రం: స్థానిక బీసీ గురుకుల పాఠశాలలో ఆదివారం ఐదో తరగతిలో ప్రవేశానికి నిర్వహించిన పరీక్షలకు 218 మంది విద్యార్థులు హాజరయ్యారని జోనల్ ఆఫీసర్ కే అంకరావు తెలిపారు. స్థానిక ప్రిన్సిపల్ తిరుపతిరావు, ఉపాధ్యాయులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎస్‌ఐ తిరుమలరావు బందోబస్తు ఏర్పాటు చేశారు.

అభినందనలు

సైదాపురం: సొసైటీ అధ్యక్షుడు, సభ్యులుగా నియమితులైన గోగినేని శివకుమార్, సభ్యులుగా గజ్జెల శివారెడ్డి, నాగరాజులను ఆదివారం వైఎస్సార్‌సీపీ నేతలు అభినందించారు. అభినందించిన వారిలో నలమారు రామ్‌గోపాల్‌రెడ్డి, మాలకొండారెడ్డి, అబ్బిరాజు, చంద్రారెడ్డి, నారాయణరెడ్డి, సుబ్బారెడ్డి, చెమిర్తి శ్రీనివాసులురాజు, పెంచలయ్య తదితరులున్నారు.

'జగనన్నే మా భవిష్యత్తు'కు అపూర్వస్పందన

నాయుడుపేటటౌన్: జగనన్నే మాభవిష్యత్తు కార్యక్రమానికి ప్రజల నుంచి అపూర్వ స్పందన వస్తుందని వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కట్టా వెంకటరమణారెడ్డి అన్నారు. మండలంలోని కోనేటిరాజుపాళెం మేనకూరులో ఆదివారం జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. కరప్రత్రాలను పంపిణీ చేసి, స్టిక్కర్లు అంటించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ వెంకటేశ్వర్లు, నాయకులు భవానీ శంకర్‌రెడ్డి, రవీంద్రరాజు, అల్లెయ్య, మల్లికార్జునరాజు, పరంధామరాజు, కాటయ్య తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట పట్టణంలో..

పట్టణంలోని పలు వార్డుల్లో కౌన్సిలర్లు ముమ్మరంగా జగనన్నే మాభవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. జేసీఎస్ కన్వీనర్లు చదలవాడ కుమార్, ఒట్టురు కిషోర్ యాదవ్ పాల్గొన్నారు.

రెండోసారి సీఎంని చేసుకుందాం

చిల్లకూరు: పేద ప్రజలకు పలు సంక్షేమ పథకాలను అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా చేసుకుందామని జెడ్పీటీసీ సభ్యుడు మన్నెం శీనయ్య పిలుపునిచ్చారు. మండలంలోని ముత్యాలపాడు సచివాలయంలోని పారిచెర్లవారిపాళెంలో ఆదివారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ వెదనపర్తి మనోజ్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ సందానీబాషా పాల్గొన్నారు.


నాయుడుపేటటౌన్: కోనేటిరాజుపాళెంలో జరిగిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వెంకటరమణారెడ్డి


చిల్లకూరు: పారిచెర్లవారిపాళెంలో..


గూడూరు: ప్రచారం చేస్తున్న నరసయ్య

సంక్షేమ ఫలాలే..మళ్లీ ఆశీర్వదిస్తాయ్..

గూడూరు: పార్టీలకతీతంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే మళ్లీ ఆయన్ని ఆశీర్వదించి, సీఎం చేస్తాయని ఓటర్లే అంటున్నారని 18వ వార్డు జేసీఎస్ కన్వీనర్ భీమవరపు నరసయ్య పేర్కొన్నారు. రెండో పట్టణంలోని జానకిరాంపేటలో ఆదివారం ఆయన వలంటరీలు, గృహసారథులతో కలసి జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాధవ్, మోహన్‌కుమారి, లక్ష్మి, ప్రవీణ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల వద్దకు ధైర్యంగా వెళుతున్నాం

చిట్టమూరు: జగనన్నే మాభవిష్యత్ కార్యక్రమంలో ప్రజల వద్దకు ధైర్యంగా వెళుతున్నాయని వైఎస్సార్ సీపీ నేత దేవారెడ్డి సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఆరూరు గ్రామంలో ఆదివారం జగనన్నే మాభవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ పెళ్లూరు సుదర్శన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నేత బల్లి మస్తానయ్య పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే సీఎం ధ్యేయం

సూళ్లూరుపేట రూరల్: నిరుపేదల అభ్యున్నతే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని, అందుకే పలు పథకాలు అమలు చేశారని ఎంపీపీ అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని మన్నేముత్తేరి పంచాయతీలో ఎంపీపీ ఆధ్వర్యంలో జగనన్నే మాభవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాల కర పత్రాలను అందజేసి, స్టికర్లు అంటించారు. సర్పంచ్ ఎద్దల చిన్నరాజా, మాజీ సర్పంచ్ రాజశేఖర్ పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధే లక్ష్యం

ఓజిలి: రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని వైఎస్సార్ సీపీ సీనియర్‌నేత, ఉప సర్పంచ్ ముమ్మడి సుబ్బారావు యాదవ్ అన్నారు. ఓజిలిలోని ఎస్సీ కాలనీలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కృష్ణయ్య, ఖాజాబాషా, పండ్లూరు వేణు, ఓజిలి రామచంద్రయ్య, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా జగనన్నే మా భవిష్యత్

రాపూరు: వైఎస్సార్‌సీపీ నేతలు మండలంలోని గ్రామాల్లో ఆదివారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం ముమ్మరంగా నిర్వహించారు. రాపూరులో కన్వీనర్లు ఆరీ ఫా, పిచ్చిరెడ్డి, రమణయ్య ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.


చిట్టమూరు: కరపత్రాలు అందజేస్తున్న నేతలు


సూళ్లూరుపేట రూరల్: స్టిక్కర్ అంటిస్తున్న ఎంపీపీ అనిల్‌కుమార్‌రెడ్డి


ఓజిలి: మహిళలకు కర పత్రాలు పంపిణీ చేస్తున్న సుబ్బారావుయాదవ్


రాపూరులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న కన్వీనర్లు

111 మంది రక్తదానం


రక్తదానం చేస్తున్న యువకులు

కోట: షిరిడీసాయి అక్షయ సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం కోటమ్మ దేవస్థానం వద్ద నిర్వహించిన రక్తదాన శిబిరంలో 111 మంది రక్తదానం చేశారు. ఈ శిబిరాన్ని ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. రెడ్‌క్రాస్ రక్తనిధి కేంద్రం సిబ్బంది దాతల నుంచి రక్తాన్ని సేకరించారు. ఈ కార్యక్రమంలో అల్లం రమణయ్య, ఆవుల సుబ్బయ్య, మధుసూదన్‌రెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు పూలే ఎక్సలెన్స్ అవార్డు


అవార్డు అందజేసి, వెంకటేశ్వరరాజును సన్మానిస్తున్న డీఈఓ, తదితరులు


అవార్డు అందుకుంటున్న ఉస్మాన్‌బాషా

గూడూరురూరల్: మండలంలోని నెర్నూరు ప్రాథమికోన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు, రచయిత కొండూరు వెంకటేశ్వరరాజు తిరుపతి డీఈఓ శేఖర్ చేతుల మీదుగా జ్యోతిరావు పూలే ఎక్సలెన్స్ అవార్డు అందుకున్నారు. సామాజిక అభ్యుదయానికి రెండు దశాబ్దాలుగా విద్య, సాహిత్య, సేవా రంగాల్లో ఆయన చేస్తున్న సేవలను ప్రోత్సహిస్తూ పూలే టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ అవార్డు ఆయనకు అందజేశారు. తిరుపతిలోని దుర్గాభాయ్ దేశ్‌ముఖ్ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన పూలే జయంతి వేడుకల్లో అవార్డుతోపాటు జ్ఞాపిక, సర్టిఫికెట్‌ను అందజేసి, ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు మాజీ న్యాయమూర్తి బి.చంద్రకుమార్, సీనియర్ పాత్రికేయుడు ఇంద్రవెల్లి రమేష్ పాల్గొన్నారు.

పాములమిట్ట ఉపాధ్యాయుడికి..

తడ: మండలంలోని పాములమిట్ట ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు, సామాజిక వేత్త షేక్ ఉస్మాన్‌బాషాను జ్యోతిరావ్ పూలే ఎక్సలెన్స్ అవార్డు వరించింది. ఈ మేరకు ఆయన తిరుపతిలో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును డీఈఓ శేఖర్, జస్టిస్ బీ చంద్రకుమార్ చేతుల మీదుగా అందుకున్నారు.

బీసీ గురుకుల పరీక్షకు 349 మంది హాజరు

కోట: బీసీ గురుకుల పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరానికి ఐదో తరగతిలో ప్రవేశానికి ఆదివారం నిర్వహించిన పరీక్షకు 349 మంది హాజరైనట్లు ప్రిన్సిపల్ నారాయణరావు తెలిపారు. కోట బాలుర గురుకుల పాఠశాలలో 200 మందికి గాను 170 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. అలాగే విద్యానగర్‌లోని బాలికల గురుకుల పాఠశాలలో 196 మందికి 179 మంది హాజరైనట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశామన్నారు.

నేటి నుంచి గడప గడపకు మన ప్రభుత్వం

దక్కిలి: మండలంలోని శ్రీపురం సచివాలయ పరిధిలో ఉన్న వెంగమనాయుడుపల్లె, శ్రీపురం గ్రామాల్లో సోమవారం, మాటుమడుగు, డీఉప్పరపల్లి (గొల్లపల్లి) గ్రామాల్లో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు జేసీఎస్ మండల ఇన్‌చార్జి చింతల శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు.

గడ్డివామి దగ్ధం

గూడూరురూరల్: మండలంలోని చెంబడిపాళెంలో శనివారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో గడ్డివామి దగ్ధమైంది. స్థానికులు కథనం మేరకు.. గ్రామంలోని మద్దూరి పున్నమ్మ పశువుల మేత కోసం వరి గడ్డి వామి వేసి, ఉంచుకుంది. అర్ధరాత్రి ఉన్నట్టుండి వామిలో మంటలు చెలరేగాయి. స్థానికులు గుర్తించి, అగ్నిమాపక శాఖకు సమాచారం ఇవ్వగా అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. ఈ ప్రమాదంలో రూ.30 వేల విలువ చేసే గడ్డి కాలిపోయినట్లు గూడూరు అగ్నిమాపక అధికారి చలమయ్య తెలిపారు.

పేదరికమే ప్రామాణికంగా పథకాలు


లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి

తడ: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేదరికమే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. ఆదివారం కొండూరు పంచాయతీలోని కొండూరు, పులివేంద్ర గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆయా గ్రామాల ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. కొండూరు సచివాలయ పరిధిలోనే ఎమ్మెల్యే స్వగ్రామం కాదలూరు ఉన్న నేపథ్యంలో ఆయకు కొండూరుతో చిన్ననాటి నుంచి అనుబంధం ఉండడంతో కిలివేటి అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. ఏవైనా సమస్యలున్నాయని తెలుసుకుని, వాటి పరిష్కారం కోసం అధికారులతో చర్చించారు. లబ్ధిదారులకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ బుక్‌లెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యే సమయానికి ఏ గ్రామానికి వెళ్లినా రేషన్ కార్డులు లేవని, ఇళ్లు, ఇళ్ల స్థలాలు రాలేదని, పెన్షన్లు అందడం లేదని, ఏళ్ల తరబడి తిరిగినా, లంచాలు ఇచ్చినా ఫలితం లేదనే మాటలు వినిపించేవని అన్నారు. ప్రస్తుతం ఆ మాట వినిపించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కే రఘురెడ్డి, డీసీఎంఎస్ డైరెక్టర్ గండవరం సురేష్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ సుందర్‌రెడ్డి, సర్పంచ్ శ్రీలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు జయంతి, వైస్ ఎంపీపీ వెంకటేష్, నాయకులు తిరుమూరు రవిరెడ్డి, మునిరత్నంరెడ్డి, మునీష్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, ఆర్ముగం, కోదండం, మునుస్వామిరెడ్డి, చంద్రయ్య, వెంకటయ్య, నరేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం


బాధితుడికి నగదు అందజేస్తున్న గౌడ జాగృతి సంక్షేమ సంఘం నాయకులు

సూళ్లూరుపేట: ఓజిలి మండలం పెద్దపరియ గ్రామానికి చెందిన గీత కార్మికుడు కే వేంకటేశ్వర్లుకు గౌడ జాగృతి సంక్షేమ సంఘం నేతలు ఆదివారం రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు. వేంకటేశ్వర్లు కల్లు గీయడానికి తాటిచెట్టుపైకి ఎక్కుతున్న సమయంలో ప్రమాదవశాత్తూ కిందపడిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. గత కొద్ది రోజులుగా మంచంపైనే ఉండి పని లేకుండా ఉండడంతో గౌడ జాగృతి సంక్షేమ సంఘం సభ్యులు పెద్దపరియకు వెళ్లి వేంకటేశ్వర్లుకు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గౌడ జాగృతి సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు అత్తిరాల కిరణ్‌కుమార్ గౌడ్, అధ్యక్షుడు బీ కిషోర్‌గౌడ్, ఉపాధ్యక్షులు కోటయ్య గౌడ్, ప్రధాన కార్యదర్శి వాసుకుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఆన్‌లైన్ తరగతులు


ఆన్‌లైన్ శిక్షణ తరగతుల్లో పాల్గొన్న పిల్లలు

నాయుడుపేటటౌన్: నిరుపేద పిల్లల్లో సృజనాత్మకత పెంపొందించడానికి చెన్నైకు చెందిన తపస్ ట్రస్టు సంస్థ ఆధ్వర్యంలో ఉచిత ఆన్‌లైన్ తరగతులను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించేందుకు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సీడబ్ల్యూసీ)చర్యలు చేపట్టినట్లు ఆ సంస్థ నెల్లూరు జిల్లా చైర్మన్ టీ మాధవి పేర్కొన్నారు. నాయుడుపేట పట్టణంలో చేయూత అనాథ పిల్లల ఆశ్రమాన్ని ట్రస్టు సభ్యులు పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి, ఆదివారం అన్‌లైన్ క్లాసులపై అవగాహనల కల్పించారు. మద్రాస్ హైకోర్టు విశ్రాంత జడ్జి జస్టిస్ బీఎస్ ప్రకాష్, అడిషనల్ సెలోటీర్ జనరల్ ఆర్ శంకర్ నారాయణ తదితర ప్రముఖులు విద్య ప్రాముఖ్యతపై వివరించారు. ఆన్‌లైన్ తరగతులకు అయ్యే ఖర్చు ట్రస్టు భరిస్తుందని తపస్ ట్రస్టు ఫౌండర్ ఎస్ లక్ష్మీనారాయణ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఐ శ్రీనివాసరావు, తొప్పని కృష్ణయ్య పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరం


రాపూరు: అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

రాపూరు: వేసవిలో అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని అగ్నిమాపక శాఖాధికారి కుప్పయ్య అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆదివారం రాపూరులోని సిద్ధలయ్యసెంటర్, మద్దెలమడుగు ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు జరిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అగ్నిప్రమాదాలు సంభవిస్తే 08621226145 నంబర్‌లో అగ్నిమాపక కార్యాలయానికి సమాచారం అందించి, వారి సహాయం తీసుకోవాలని సూచించారు.

సమాచారం అందించాలి

నాయుడుపేటటౌన్: అగ్నిప్రమాదాల సంభవించిన వెంటనే అగ్నిమాపకశాఖ అధికారులకు సమాచారం అందించాలని అగ్నిమాపక శాఖ అధికారి కే శ్యామ్‌బాబు సూచించారు. ఆదివారం పట్టణంలో పలు అపార్టుమెంట్‌లు, ప్రధాన కూడళ్ల తదితర చోట్ల అగ్నిప్రమాదాలపై నివారణ చర్యలు, చేపట్టాల్సిన జాగ్రత్తలపై మాక్ డ్రిల్‌గా చేసి చూపారు. జాగ్రత్తలపై కరపత్రాలను పంపిణీ చేశారు. ఏదైన అగ్నిప్రమాదం సంభవిస్తే ముందస్తు జాగ్రత్త చర్యలుగా, 100కు లేదా 101 కు ఫోన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్ఎఫ్ డీపీ రమణయ్య, ఎం మురళి, ఎఫ్ఎంలు వై శివకృష్ణ, ఏ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్లలో జాగ్రత్తలు పాటించాలి

కోట: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆదివారం కోట ఫైర్‌స్టేషన్ సిబ్బంది కోట, విద్యానగర్‌లోని పలు అపార్ట్‌మెంట్లలో నివాసం ఉంటున్న వారికి ప్రమాదాలపై అవగాహన కలిగించారు. అపార్ట్‌మెంట్లలో నివాసం ఉంటున్న వారు ఫైర్‌సేఫ్టీ నిబంధనలు పాటించాలన్నారు. అగ్నిప్రమాదాలు, విద్యుత్, గ్యాస్ ప్రమాదాలు ఎదురైనపుడు వాటి నుంచి తప్పించుకోవడంపై ప్రయోగాత్మకంగా చూపించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఓ చలమయ్య, అగ్నిమాపక శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

సూళ్లూరుపేట: పట్టణంలోని బహుళ అంతస్తు భవనాల్లో అగ్నిప్రమాదాలను నివారించేందుకు అవసరమైన పరికరాలను ఏర్పాటు చేసుకోవాలని అగ్నిమాపక కేంద్రం అధికారి సీహెచ్ రఘునాథరెడ్డి సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆదివారం కీర్తి ఎన్‌క్లేవ్ టౌన్‌షిప్‌లో అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. అపార్ట్‌మెంట్లలో అగ్నిప్రమాదాలు జరిగితే ఎలాంటి చర్యలు తీసుకోవాలి. ఏ విధమైన చర్యలు చేపడితే ప్రజలన్ని కాపాడొచ్చు అనే అంశంపై మాక్‌డ్రిల్ కార్యక్రమాన్ని చేసి చూపించారు.


కరపత్రాలను చూపుతున్న అగ్నిమాపక శాఖ అధికారులు


సూళ్లూరుపేట: అగ్నిప్రమాదాల నివారణపై డెమో ఇస్తున్న సిబ్బంది

నిలకడగా నిమ్మ ధరలు


గ్రేడింగ్ చేసి ప్యాకింగ్‌కు సిద్ధం చేసిన నిమ్మకాయలు

గూడూరు: నిమ్మ ధరలు నిలకగా కొనసాగుతున్నాయి. దీంతో సీజన్‌పై నిమ్మ రైతన్నలు పెట్టుకున్న ఆశలు వృథా పోలేదు. దాదాపు ఒకటిన్నర నెలకు పైగా నిమ్మ ధరలు నిలకడగా ఉండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం కూడా నిమ్మ ధరలు కిలో కనిష్టంగా రూ.55, గరిష్టంగా రూ.85 వరకు పలికాయి. గత నెలలోనూ, ఈ నెల మొదటి వారంలోనూ కిలో ధర రూ.70 నుంచి రూ.95 వరకు పలికినప్పటికీ, ఈ ఒకటిన్న నెలలో సరాసరిన కిలో రూ.70 పలకడంతో నిమ్మ రైతులకు గిట్టుబాటు ధర దక్కింది. నిమ్మ రైతులకు మార్చి, ఏప్రిల్ నెలల్లో మాత్రమే ధర బాగా వస్తుంది. మార్చి నెలలో కొంత మేరకు ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. అయితే అనుకోని పరిస్థితుల్లో ఈ నెల మొదటి వారంలో ఢిల్లీ, లక్నో, కోల్‌కతా తదితర ప్రాంతాల్లో విపతీరమైన వర్షాలు కురిశాయి. అలాగే తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి కొనసాగుతోంది. దీంతో ఆయా మార్కెట్‌ల నుంచి కాయల ధరలు కొంత మేర తగ్గాయి. దీంతో నిమ్మ ధరలు ఊపందుకుని కిలో గరిష్టంగా రూ. 95 వరకు పలికాయి.

ఈ ధరలుంటే ఇంకేంకావాలి



ఇప్పుడు కిలో నిమ్మకాయలు గరిష్టంగా పలుకుతున్న రూ 85 పలుకుతున్నాయి. అంటే లూజు బస్తా (80 కిలోలు) రూ 6,800 సరాసరిన అయినా రూ 5 వేల నుంచి రూ 6 వేల వరకూ పలుకుతున్నాయి. సరాసరిన లూజు బస్తా ఈ ధరలుంటే రైతులకు ఇంకేం కావాలి.

\- జగన్నాథం, నిమ్మ రైతు

ఢోకాలేదు



దాదాపు 50 రోజులుగా నిమ్మ ధరలు కాస్త పెరుగుతూ..తగ్గుతూ ఉన్నా..సుమారుగా 50 రోజులుగా ధరలు నిలకడగానే ఉన్నాయి. సీజన్‌లో ఈ మాత్రం ధరలుంటే నిమ్మ రైతులకు ఇంత కంటే ఇంకేం కావాలి. మార్చి నెలలో కొందరు రైతులకు కాయల్లేకున్నా, ఏప్రిల్‌లో వచ్చాయి. దీంతో వారికి కూడా లాభాలు వచ్చాయి. - బాబు, నిమ్మరైతు